# చెట్ల నరికివేతపై సీరియస్

- వేబ్రిడ్జి నిర్వాహకులకు నోటీసులు.. ₹5వేల జరిమానా
- 'నమస్తే'లో కథనంతో కదిలిన యంత్రాంగం

నమస్తే ఎఫెక్ట్

ముత్తారం, ఏప్రిల్ 10: ముత్తారంలో వేబ్రిడ్జి పనులకు ఆటంకం కలుగుతుందనే నెపంతో హరితహారం చెట్లను నరికివేయడంపై అధికారులు సీరియస్ అయ్యారు. 'హరితహారం చెట్లు నరికివేత' శీర్షికన బుధవారం 'నమస్తేతెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. ముత్తారం కార్యదర్శి సంతోష్, బేగంపేట సెక్షన్, బీట్ ఆఫీసర్లు నర్సయ్య, పవన్.. అనుమతులు లేకుండా చేపట్టిన వేబ్రిడ్జి పనులను పరిశీలించారు. చెట్ల నరికివేతకు కారణమైన నిర్వాహకులకు ముత్తారం పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. బాధ్యులకు ₹5వేల జరిమానా విధించారు. పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని, లేదంటే శాఖపరమైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం




జగిత్యాల రూరల్, ఏప్రిల్ 10 : తెలంగాణ స్టేట్ మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ 2024-25 సంవత్సరంలో వంద మంది మైనార్టీ విద్యార్థులకు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ కోసం ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు జగిత్యాల జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, శారీరక దివ్యాగులకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 28న ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం ₹5లక్షలు ఉండాలన్నారు. అన్ని జిల్లాలకు చెందిన స్టేట్ మైనార్టీ కమ్యూనిటీల డిగ్రీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040-2323 6112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



హన్మంతరావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కేసీఆర్



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను ఓదారుస్తూ..

# జగిత్యాలలో కేసీఆర్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు పరామర్శ
- గత నెల 29న సంజయ్‌కు పితృవియోగం
- విరూపాక్షి గార్డెన్‌లో 13రోజుల కార్యక్రమానికి హాజరు

జగిత్యాల, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం జగిత్యాలకు వచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరు సంజయ్‌కుమార్‌ను పరామర్శించారు. సంజయ్‌కుమార్ తండ్రి సీనియర్ న్యాయవాది హన్మంతరావు గత నెల 29న మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం జగిత్యాల పట్టణంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో నిర్వహించిన హన్మంతరావు స్వర్గపాత్ర కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత హాజరయ్యారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కేసీఆర్ హెలిక్యాప్టర్‌లో రాగా, జగిత్యాల కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్ వద్ద జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వాహనంలో విరూపాక్షి గార్డెన్‌కు ఆయన చేరుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి హన్మంతరావు చిత్రపటానికి పూలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. దాదాపు ఆరున్నర దశాబ్దాలకు పైగా న్యాయవాద వృత్తికి హన్మంతరావు చేసిన సేవలను కేసీఆర్ కొనియాడారు. కాగా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, సుంకె రవిశంకర్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, మాజీ మేయర్ రవీందర్ సింగ్ తదితరులు పరామర్శించారు.

# బ్లాక్ మెయిలర్‌పై చర్యలు తీసుకోండి

- ఈసీ, రామగుండం సీపీకి కొప్పుల ఫిర్యాదు

వెల్గటూర్, ఏప్రిల్ 10: ₹పది లక్షలు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్, రామగుండం సీపీకి పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం వివరాలు వెల్లడించారు. నిమ్మ భరత్ గత నెల కరీంనగర్‌లోని తన కార్యాలయానికి వచ్చి తాను సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటానని.. ఈ ఎన్నికల సమయంలో మీకు అనుకూలంగా పోస్టులు పెడతానని చెప్పాడన్నారు. తాము ఇంకా ప్రచారం మొదలు పెట్టలేదని, అవసరముంటే సహకారం తీసుకుంటామని చెప్పి పంపించినట్లు చెప్పారు. అదేరోజు అతడిని చూశానని, గతంలో అతనితో పరిచయం లేదని స్పష్టంచేశారు. ఉన్నట్టుండి ఈ నెల 7న ₹10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తన ఫోన్‌కు మెసేజ్ చేశాడన్నారు. మధ్యాహ్నంలోగా తన ఖాతాలో డబ్బులు పడకుంటే.. తనతోపాటు కేసీఆర్, కేటీఆర్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి తీన్మార్ మల్లన్నకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడన్నారు. బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు కొప్పుల తెలిపారు.

# మోసమే కాంగ్రెస్ నైజం

- ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలకు ఎగనామం
- ₹2లక్షల పంట రుణమాఫీని అటకెక్కించింది
- నాలుగు నెలల్లోనే సర్కారుపై వ్యతిరేకత
- సంజయ్ ఐదేళ్లలో ఐదు పైసలు కూడా తేలె
- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్



మార్నింగ్ వాక్ లో ఓటర్లతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

చిగురుమామిడి, ఏప్రిల్ 10: 'మోసమే కాంగ్రెస్ నైజం. ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలకు ఎగనామం పెట్టింది' అని బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ నిప్పులు చెరిగారు. ఐదేండ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఐదు పైసలు కూడాతేలేదని దుయ్యబట్టారు. బుధవారం ఉదయం ఆయన హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా వాకర్లతో ముచ్చటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వినోద్ మాట్లాడారు. డిసెంబర్ 9న రైతులకు ₹2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్, నాలుగు నెలలు దాటినా ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. 2 లక్షల ఉద్యోగాల హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, సాగునీరు లేక పంట ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తాను కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లలో కేంద్రంతో కొట్లాడి జాతీయ రహదారులు, రైల్వే లైన్లు మంజూరు చేయించానని చెప్పారు. ప్రస్తుత ఎంపీ ఈ ప్రాంత అభివృద్ధికి నయాపైసా తేలేదని దుయ్యబట్టారు. ఆయన ఓట్ల కోసం ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు. కేంద్రం వివిధ పథకాల కింద అన్ని రాష్ట్రాలకు నిధులిస్తుందని, కానీ సంజయ్ ఈ నిధులను తానే తెచ్చానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రం లో 33 జిల్లాలకు తొమ్మిదే నవోదయ స్కూళ్లు ఉన్నాయని, ఐదేళ్లలో బండి ఒక్క నవోదయ స్కూల్ కూడా మంజూరు చేయించలేదన్నారు. హుస్నాబాద్ ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే ప్రజల గొంతుకగా పార్లమెంట్‌లో తన వాణిని వినిపిస్తానని స్పష్టం చేశారు. హుస్నాబాద్‌కు నవోదయ స్కూల్‌ను తీసుకువస్తారని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో పసిడి పంటలతో సస్యశ్యామలంగా ఉన్న కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గం ఇప్పుడు సాగునీరు లేక ఏడారిని తలపిస్తున్నదని ఆవేదన చెందారు. అసెంబ్లీ ఎన్నికల ముందర కాంగ్రెస్ అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టిందని, మళ్లీ ఇప్పుడు మోసం చేసేందుకు తప్పుడు వాగ్దానాలు ఇస్తున్నదని విమర్శించారు. వినోద్ కరీంనగర్ ఎంపీగా అనేక అభివృద్ధి పనులు చేశారని, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా తెచ్చారని, రైల్వేలైన్లు, జాతీయ రహదారులకు నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. అభివృద్ధి కావాలంటే ప్రజలు ఆలోచించి ఓటేసి వినోద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్వర్ పాషా, కౌన్సిలర్లు రవి, శ్రీనివాస్, సుప్రజ, రాజు, రవీందర్ రావు, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య ఉన్నారు.




మహిళా కార్మికులకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, కోరుకంటి

# ఆదరించి అవకాశమివ్వండి

- ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా
- కారుణ్య ఉద్యోగాల ఘనత కేసీఆర్‌దే
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, ఏప్రిల్ 10: సింగరేణి కార్మికుడి బిడ్డగా.. ఒకప్పటి కార్మికుడిగా తనను ఆదరించి అవకాశం ఇవ్వాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అభ్యర్థించారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. సింగరేణిలో పోయిన కారుణ్య ఉద్యోగాలను తిరిగి పునరుద్ధరించిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదేనని కొనియాడారు. సింగరేణి జీడీకే-1వ గనిలో ఓటు అభ్యర్థించారు. సింగరేణి కార్మికులకు సంబంధించి కొన్ని జఠిలమైన సమస్యలు ఉన్నాయని, తనను దీవిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇన్‌కం టాక్స్ మినహాయింపుతోపాటు సొంతింటి కల, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రామగుండం ప్రాంతంలో పొల్యూషన్‌తో ప్రజలు అనేక ఇబ్బందులను పడుతున్నారని, నివారణ చర్యలు చేపడతామన్నారు. ఇప్పటి వరకు సింగరేణిలో 15వేల ఉద్యోగ అవకాశాలను కల్పించి ఎంతోమంది కుటుంబాల్లో కేసీఆర్ వెలుగులు నింపారని, ఎంతోమంది యువతకు ఉద్యోగాలు కల్పించారని ప్రశంసించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డి ఉన్నారు.

# మీ ఇంటికి ఇంకుడుగుంత ఉన్నదా..?

నగరాలు, పట్టణాల్లో ప్రత్యేక సర్వే ప్రారంభం

- మూడు గుంటల స్థలంలో నిర్మాణాలకు తప్పనిసరి చేసిన కేసీఆర్ సర్కారు
- భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో మున్సిపల్ శాఖ అప్రమత్తం
- జీయో ట్యాగింగ్ ద్వారా లెక్కతేల్చే పనిలో నిమగ్నం
- 'సోక్ పిట్స్' లేకపోతే నోటీసులు



కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 10: వేసవి వచ్చిందంటే చాలు నగరాలు, పట్టణాల్లో భూగర్భజలం అడుగంటిపోతున్నది. నీటి కటకట తీవ్రమవుతున్నది. ఇలా ఎద్దడి రాకుండా ఉండాలంటే ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ప్రభుత్వాలు చెబుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో గత కేసీఆర్ ప్రభుత్వం సైతం నగరాలు, పట్టణాల్లో నిర్మించే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత కచ్చితంగా తవ్వుకోవాలనే నిబంధనను తీసుకొచ్చింది. అయితే చాలా మంది ప్రజలు విస్మరించినట్లు తెలుస్తున్నది. ఇటీవల కర్ణాటకలోని బెంగళూర్‌లో నీటిని కొనుక్కొని వాడుకునే దుస్థితి రావడం, రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటుతుండడం ప్రతి ఒక్కరినీ భయపెడుతుండగా.. రాష్ట్ర మున్సిపల్ శాఖ అప్రమత్తమైంది. అసలు నగరాలు, పట్టణాల్లో ఏ మేరకు ఇంకుడు గుంతలు ఉన్నాయో పరిశీలించేందుకు సిద్ధమైంది. మొదటగా మూడు గుంటల విస్తీర్ణంలో నిర్మించిన ఇండ్లకు ఇంకుడు గుంతలు ఉన్నాయో.. లేదో.. తేల్చాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రత్యేక సర్వే చేయాలని భావించింది. జియోట్యాగింగ్ కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించి ఇటీవలే అందుబాటులోకి తెచ్చింది. అధికారులు ఆయా ఇండ్లకు వెళ్లి ఇంకుడు గుంత ఉందో.. లేదో పరిశీలించడంతోపాటు దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా, కరీంనగర్ నగరపాలక సంస్థలో వార్డు ఆఫీసర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది 20 మందికి బాధ్యతలు అప్పగించగా, హుజూరాబాద్, జమ్మికుంట, కొత్తపల్లి, చొప్పదండి మున్సిపాలిటీల్లోనూ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లకు కట్టబెట్టారు. వచ్చే నాలుగు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ ఆదేశాలు జారీ చేయగా, అధికారులు బుధవారం నుంచే సర్వే ప్రారంభించారు. ఇంకుడు గుంతలు లేని ఇండ్ల వారికి నోటీసులు జారీ చేయనున్నారు. రానున్న రోజుల్లో చట్టపరమైన చర్యలు ఉండొచ్చని చెబుతున్నారు.



ఇసుక లారీల పట్టివేత పేపర్ కథనాలను చూపుతున్న పుట్ట మధూకర్

# ఆ పార్టీ పాలనలో మాఫియా రాజ్యం

- కాంగ్రెస్ హయాంలో యథేచ్ఛగా ఇసుక, మట్టి, బియ్యం దందా
- ఎన్నికల ముందు నాపై తప్పుడు ఆరోపణలు చేసిన్రు
- ఇప్పుడెందుకు ఆధారాలు చూపడం లేదు
- నన్ను చంపాలని చూస్తున్నరు
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ధ్వజం

మంథని, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పాలనలో ఇసుక, మట్టి, బియ్యం మాఫియా రాజ్యమేలుతున్నదని పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఎన్నికల ముందు తనపై అడ్డగోలుగా ఆరోపణలు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా ఆధారాలు ఎందుకు చూపడంలేదు?' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఇసుక క్వారీలు ఆదాయ వనరులుగా ఉండేవని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అక్రమంగా క్వారీలు నడిపిస్తున్నారని ఆరోపించారు. 2018, 2023 లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ నేతలు రాబోయే ఎన్నికల్లో వారికి ఎదురు లేకుండా చూసేందుకు నన్ను చంపేందుకు కూడా కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తన పదవీ కాలం ముగిసిన వెంటనే గన్‌మెన్లను తొలగించి హతమార్చేందుకు పథకం రూపొందించారని ఆరోపించారు. మంథనిలోని రాజగృహలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ దందాలు జోరుగా సాగుతున్నాయని, నియోజకవర్గంలో నిత్యం ఏదో ఒక చోట ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలు పట్టుబడుతున్నాయన్నారు. పోలీస్‌స్టేషన్లలో సైతం పైరవీల కోసం ప్రత్యేకంగా ఇన్‌చార్జిలను నియమించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తనపై ఇసుక లారీలు, క్వారీలు ఉన్నాయని ఆరోపించారని, ప్రస్తుతం వారి ప్రభుత్వమే అధికారంలో ఉందని, ఆరోపణలు ఎందుకు రుజువు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి ప్రజలు నరకం అనుభవిస్తున్నారన్నారు. మంథని ప్రజల ఆశీర్వాదంతో బీసీ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా ఎదిగిన తనపై కాంగ్రెస్ నేతలు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేసి ప్రజల నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఇక్కడి ప్రజలు చైతన్య వంతులై తనపై చేసిన ఆరోపణలపై ఆధారాలు చూపించాలని కాంగ్రెస్సోళ్లను ప్రశ్నించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేశ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, ఎరుకల రవి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుగా నిలిపిన ద్విచక్రవాహనాలు

# పార్కింగ్.. మా ఇష్టం

- కరీంనగర్ కలెక్టరేట్ ఎంట్రెన్స్ ఎదుట వాహనాల నిలిపివేత
- లోపలికి వెళ్లేదారి లేక ప్రజలు, ఉద్యోగుల పాట్లు



నిలిపిన వాహనాలు

కరీంనగర్ కలెక్టరేట్ ఎంట్రెన్స్ వాహన పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయింది. ప్రధాన ద్వారం ఎదుట నో పార్కింగ్ బోర్డులు, బ్యానర్లు ఉన్నా వాహనదారులు ఇష్టారాజ్యంగా వెహికిల్స్ పార్క్ చేస్తుండగా, లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతున్నది. వాహనాలు నిలిపేందుకు పక్కనే ఉన్న చెట్ల కింద ఖాళీ స్థలం చదును చేసినా, ప్రధాన ద్వారం ఎదుట పార్క్ చేస్తుండడంతో ప్రభుత్వ విభాగాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాలు నిలుపకుండా చూడాలని కోరుతున్నారు. - కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఆటోనగర్‌లో కమ్ముకున్న పొగ

# కమ్మేస్తున్న పొగ



కరీంనగర్ బైపాస్‌లో ..

కరీంనగరాన్ని పొగ కమ్మేస్తున్నది. ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. శివారులో ఉన్న డంప్ యార్డుకు మంటలు అంటుకొని దట్టమైన పొగ వ్యాపిస్తున్నది. దీంతో రాంపూర్, ఆటోనగర్, హనుమాన్‌నగర్, కృష్ణనగర్ తదితర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే మంటలు అంటుకోవడం, స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. బుధవారం వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేసినా, చెత్త నుంచి దట్టమైన పొగ వస్తూనే ఉన్నది. డంప్ యార్డు స్థానంలో తీసుకొచ్చిన బయోమైనింగ్‌పై శ్రద్ధ చూపకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడుతున్నది.

- కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 10

# ఉచిత శిక్షణకు స్పాట్ అడ్మిషన్లు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 10: పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న అభ్యర్థులకు ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని పెద్దపల్లి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నాగైలేశ్వర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చిందని, ఈ నేపథ్యంలో ఎస్సీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలల శిక్షణ కోసం 100 మందిని ఎంపిక చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 16వ రకు స్పాట్ అడ్మిషన్స్‌కు అవకాశం కల్పించామని పేర్కొన్నారు.


